# రైతులను ఠాణాకు ఈడ్చుకెళ్లారు!

- కడుపు కాలి.. రోడ్డెక్కిన రైతన్న
- అన్నదాతలపై పోలీసుల దౌర్జన్యం
- తడిసిన ధాన్యం కొనాలని ధర్నా
- మద్దతు పలికిన బీఆర్ఎస్
- పోలీసుల అత్యుత్సాహంపై మాజీ ఎమ్మెల్యే ఫైర్

ఆమనగల్లు, మే 26 : కొనుగోళ్లలో వేగం పెంచాలని, తడిసిన ధాన్యాన్ని కొనాలని డిమాండ్ చేస్తూ రంగారెడ్డి జిల్లా ఆమనగల్లులో రైతులు రోడ్డెక్కితే పోలీసులు దౌర్జన్యానికి దిగారు. వారిని ఈడ్చుకెళ్లి అరెస్ట్‌చేశారు. సోమవారం రైతులు హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై బైఠాయించగా బీఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు నేనావత్ పత్యానాయక్‌తోపాటు పార్టీ శ్రేణులు వారికి మద్దతు తెలిపి ఆందోళనలో పాల్గొన్నారు. దీంతో పోలీసులు అత్యుత్సాహాన్ని ప్రదర్శించి వారిని నెట్టేయడంతోపాటు బలవంతంగా అరెస్టు చేసి ఠాణాకు తరలించారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్.. ఠాణాకు చేరుకుని అరెస్టు అయిన బీఆర్ఎస్ నాయకులు, రైతులను పరామర్శించారు. శాంతియుతంగా ధర్నా చేస్తున్న రైతులు, బీఆర్ఎస్ నాయకులపై పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించి బలవంతంగా నెట్టేయడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. అనంతరం బీఆర్ఎస్ శ్రేణుల తో కలిసి వ్యవసాయ మార్కెట్ యార్డుకు చేరుకుని తడిసిన, మొలకెత్తిన ధాన్యాన్ని పరిశీలించారు. వడ్లను విక్రయించేందుకు తీసుకొచ్చి 25 రోజులు దాటినా తూకం వేయరా? అంటూ మండిపడ్డారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో రాక్షస పాలన సాగుతున్నదని ధ్వజమెత్తారు. కేసీఆర్ ప్రభుత్వంలో ప్రతి గ్రామంలోనూ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రతి రైతు నుంచి ధాన్యాన్ని సేకరించి.. మద్దతు ధర చెల్లించిన విషయాన్ని గుర్తుచేశారు. 18 నెలల కాంగ్రెస్ పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందని అన్నారు. సర్కార్ రైతులకు పూర్తి స్థాయిలో రుణ మాఫీ చేయకుండా, రైతుభరోసా పెట్టుబడి సాయాన్ని అర్హులకు అందించకుండా ఆగం చేస్తున్నదని మండిపడ్డారు. మార్కెట్ యార్డుకు తీసుకొచ్చిన ధాన్యాన్ని కొర్రీలు పెడుతూ కొనకపోవడంతో వర్షాలకు తడిసి రైతులు కష్టం నేల పాలవుతున్నదని ఆవేదన వ్యక్తంచేశారు.


హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై బైఠాయించి నిరసన తెలుపుతున్న రైతులను స్టేషన్‌కు తరలిస్తున్న పోలీసులు


ఆమనగల్లు వ్యవసాయ మార్కెట్ యార్డు ముందు ధాన్యాన్ని పరిశీలిస్తున్న కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ తదితరులు

## ఇది చెరువు కాదు.. కొనుగోలు కేంద్రమే..


యాలాల, మే 26: ఈ చిత్రంలో కనిస్తున్నది చెరువు కాదు.. ధాన్యం కొనుగోలు కేంద్రం. ఇది వికారాబాద్ జిల్లా యాలాల మండలం బెన్నూరులో ఉన్నది. వర్షాల కారణంగా ఈ కేంద్రంలోని వడ్ల కుప్పలన్నీ తడిసిపోయాయి. ఒకవైపు ధాన్యాన్ని విక్రయించేందుకు రైతులు కేంద్రానికి తీసుకెళ్తే.. హమాలీలు లేరని.. సంచులు సరిపడా లేవని పలు కారణాలు చెప్పుతూ తూకం వేయడంలేదు. మరోవైపు అకాల వర్షాలు కురుస్తున్నాయని తెలిసీ కూడా తూకం చేసిన ధాన్యం బస్తాలను రైస్ మిల్లులకు తరలించడం లేదు. దీంతో వడ్లు తడిసి మొలకెత్తుతున్నాయి. ఈ సమస్య యాలాల మండలంలోని ప్రతి కొనుగోలు కేంద్రంలో ఉన్నది.

## ధాన్యం కొంటలేరని వంటావార్పు


మల్హర్, మే 26 : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మల్హర్ మండల కేంద్రంలోని తాడిచెర్ల కొనుగోలు కేంద్రంలో ధాన్యం కొనడం లేదంటూ రైతులు సోమవారం ఆందోళనకు దిగారు. తాడిచెర్ల-మల్లారం ప్రధాన రహదారిపై రైతులు ధర్నా చేసి వంటావార్పు నిర్వహించారు. ధాన్యం కొనుగోలు చేసేవరకు ఆందోళన విరమించేది లేదంటూ భీష్మించారు.

## రెక్కల కష్టమంతా నీటిపాలాయె..


చందుర్తి, మే 26 : రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలకేంద్రానికి చెందిన మహిళా రైతు వెంకవ్వ మొలకెత్తిన ధాన్యంతో తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపింది. నెలన్నర కిందట కొనుగోలు కేంద్రానికి ధాన్యం తీసుకురాగా ఐకేపీ నిర్వాహకులు జాప్యం చేయడంతో వర్షానికి తడిసింది. దీంతో సోమవారం మొలకెత్తిన ధాన్యంతో నిరసన తెలిపింది.


ఏపూరు ఐకేపీ కేంద్రంలో రైతుల వడ్లను పరిశీలించి సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి

# తెలంగాణలో దొంగలు పడ్డారు



### ఎవరికి దొరికింది వారు దోచుకుంటున్నారు :జగదీశ్‌రెడ్డి

ఆత్మకూర్.ఎస్, మే 26 : తెలంగాణలో దొంగలు పడ్డారని, ఎవరికి దొరికింది వారు దోచుకుంటున్నారని ఇందులో సీఎం, మంత్రులు ఎవరి దోపిడీ వాళ్లదేనని ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి ఆరోపించారు. సూర్యాపేట జిల్లా ఆత్మకూర్.ఎస్ మండలం ఏపూరు ఐకేపీ సెంటర్‌లో మొలకెత్తిన వడ్లను సోమవారం ఆయన పరిశీలించి రైతులతో మాట్లాడారు. రుతుపవనాలొచ్చి దుక్కి దున్నాల్సిన రైతు ధాన్యం కుప్పల వద్ద కాపలా ఉండాల్సి వస్తున్నదని చెప్పారు. కాంటాలయ్యాక మిల్లుల్లో రైతులతో బేరాలాడుతున్నారని మండిపడ్డారు. రెండు నెలలవుతున్నా ధాన్యం కాంటాలు వేయకపోవడం దురదృష్టకరమని మండిపడ్డారు. వడ్లు ముక్కి మొలకలొస్తున్నాయని ఆవేదన చెందారు. ఐకేపీ కేంద్రాల్లో ఫార్‌బాయిల్డ్ వాసనలు వస్తున్నాయని చెప్పారు. రైతుల కష్టాలు ప్రభుత్వానికి పట్టవా అని ప్రశ్నించారు. ప్రతి గింజనూ ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్‌చేశారు.



## తడిసి తడిసి.. బూజుపట్టి..

ధాన్యాన్ని కేంద్రానికి తీసుకొచ్చి 20 రోజులైనా కొనుగోలు చేయకపోవడంతో వర్షానికి తడిసి వడ్లు మొలకెత్తి బూజు పడుతున్నాయి. సోమవారం నిర్మల్ జిల్లా లక్ష్మణచాంద మండలం పార్‌పెల్లిలోని కొనుగోలు కేంద్రంలో ధాన్యం బూజు పట్టడంతో రైతులు ఆందోళనకు గురయ్యారు.- లక్ష్మణచాంద

# రైతును ఆదుకునేలా విత్తన చట్టం

### వ్యవసాయశాఖ డైరెక్టర్ బీ గోపి

హైదరాబాద్, మే 26 (నమస్తే తెలంగాణ): నూతన విత్తన చట్టం ముసాయిదా రూపకల్పనలో రైతుల అభిప్రాయాలే కీలకమని ముసాయిదా కమిటీ కన్వీనర్, వ్యవసాయశాఖ కమిషనర్ బీ గోపి స్పష్టంచేశారు. సోమవారం బీఆర్కే భవన్‌లోని రైతు కమిషన్ కార్యాలయంలో విత్తన చట్టం రూపొందించడానికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ తొలి సమావేశం జరిగింది. ఇతర రాష్ట్రాల్లో అమలవుతున్న విత్తన చట్టాలపై అధ్యయనం, తెలంగాణ రైతుల సూచనలతో సమగ్ర చట్టం రూపొందించాలని సమావేశంలో కమిటీ సభ్యులు, అధికారులు అభిప్రాయం వ్యక్తంచేశారు. రైతుకు విత్తన హక్కు కల్పన, నకిలీ విత్తనాలు అరికట్టడం, నకిలీలతో నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించే ప్రతిపాదనలపై ప్రధానంగా చర్చించారు.

## నిప్పబెట్టి.. నిరసన తెలిపి..


పర్వతగిరి, మే 26 : ధాన్యం కొనుగోలులో జాప్యాన్ని నిరసిస్తూ రైతులు సోమవారం ఆందోళనకు దిగారు. వరంగల్ జిల్లా పర్వతగిరి మండలంలోని బూరుగుమళ్లలోని కొనుగోలు కేంద్రం వద్ద కల్లెడ-బూరుగుమళ్ల గ్రామాల ప్రధాన రోడ్డుపై ధాన్యాన్ని తగులబెట్టి నిరసన తెలిపారు. పీఏసీఎస్ సిబ్బంది కొనుగోలు కేంద్రాన్ని నిర్వహించడంలో అలసత్వం ప్రదర్శిస్తున్నట్టు మండిపడ్డారు. సుమారు 8 లారీల ధాన్యం ఉన్నా కొనుగోళ్లు ముందుకు సాగడం లేదని ఆరోపించారు. వర్షాలతో ధాన్యం తడిసి పోతుందని తెలిపారు.



## రోడ్డుపై బర్లతో నిరసన


తమ వ్యవసాయ బావికి విద్యుత్తు సరఫరాను పునరుద్ధరించాలని కోరుతూ రైతు దంపతులు వినూత్న రీతిలో నిరసన తెలిపారు. కరీంనగర్ జిల్లా గునుకుల కొండాపూర్‌లో నెల క్రితం ధాన్యం లోడ్‌తో వెళ్తున్న లారీ విద్యుత్తు వైర్లకు తాకడంతో కరెంటు స్తంభం విరిగిపోయింది. అప్పటి నుంచి పోచయ్య, సుశీల దంపతుల వ్యవసా య బావికి విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది. దీంతో సోమవారం కొండాపూర్‌లోని రోడ్డుపై బర్లను కట్టేసి నిరసన తెలిపారు.- గన్నేరువరం

# పచ్చిరొట్ట రేట్లు డబుల్!

- 30 కిలోల బస్తా ధర రూ.2175
- నిరుడు ఇదే బస్తా రూ.1,116లకే

వరంగల్, మే 26 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని నిర్లక్ష్యం చేస్తున్నది. సాగుకు కీలకమైన విత్తనాల విషయంలోనూ ఇదే రకంగా వ్యవహరిస్తున్నది. పంట ఉత్పత్తి పెరిగేందుకు ఉపయోగించే జీలుగ (పచ్చిరొట్ట) విత్తనాలను రైతులకు అందకుండా చేసింది. సబ్సిడీపై రైతులకు సరఫరా చేయాల్సిన జీలుగ విత్తనాలు ఇప్పుడు రైతులకు అందుబాటులో లేకుండాపోయాయి. ప్రభుత్వం జీలుగ విత్తనాల సరఫరాను పట్టించుకోకపోవడంతో రైతులపై ఆర్థికంగా భారం పడుతున్నది. వ్యవసాయ శాఖ అధికారుల సిఫారసు మేరకు ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాలు, ప్రాథమిక వ్యవసాయ సహకార కేంద్రాల్లో రైతులకు సబ్సిడీపై రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేస్తుంది. బీఆర్ఎస్ హయాంలో 30 కిలోల బస్తా 50 శాతం సబ్సిడీతో రూ.1,116 చొప్పున అందించేది. గత ఏడాది వరకు ఇదే ధర ఉన్నది. కాంగ్రెస్ సర్కార్ ప్రస్తుతం రూ.2175కు విక్రయిస్తున్నది. ధర రెట్టింపు చేసినా జీలుగ విత్తనాలు రైతులకు ఎక్కడా దొరకడంలేదు. ప్రస్తుతం ఒక్క రైతుకు 60 కిలోలకు మించి ఇవ్వడంలేదు. ఎకరానికి 12 కిలోల జీలుగ విత్తనాలు అవసరమవుతాయి. ప్రభుత్వం ఏప్రిల్‌లోపే జీలుగ విత్తనాల దిగుమతికి ట్రాన్స్‌పోర్టు టెండర్ల ప్రక్రియను పూర్తి చేసి సకాలంలో రైతులకు అందుబాటులో ఉంచాలి. ఈసారి విత్తనాల సరఫరాకు అవసరమైన చర్యలు తీసుకోలేదు. టెండర్ల ప్రక్రియను నిర్వహించలేదు. ఆలస్యంగా టెండరు ప్రక్రియను మొదలు పెట్టింది. గత ఏడాది జీలుగ విత్తనాలను సరఫరా చేసిన వారికి ఇప్పటికీ ప్రభుత్వం బిల్లులు చెల్లించలేదు. ఫలితంగా టెండర్లలో సరఫరాదారులు పాల్గొనలేదు. రాష్ట్ర ప్రభుత్వం రెండోసారి టెండర్లు నిర్వహించింది. ఆలస్యంగా ఈ ప్రక్రియ చేపట్టడంతో టెండర్లలో గోల్‌మాల్ జరిగేలా ప్రభుత్వంలోని పెద్దలు, ఉన్నతాధికారులు వ్యవహరించినట్టు ఆరోపణలు ఉన్నాయి.

## కాంటా పెట్టాలని రహదారి దిగ్బంధం


పెబ్బేరు, మే 26: కాంటా పెట్టాలని డిమాండ్ చేస్తూ వనపర్తి జిల్లా శ్రీరంగాపురం మండలం శేరిపల్లిలో రైతులు సోమవారం రహదారిని దిగ్బంధించారు. కేంద్రానికి ధాన్యం తెచ్చి రోజుల తరబడి పడిగాపులు కాస్తున్నా తూకం వేయడం లేదని గ్రామ సమీపంలోని పెబ్బేరు-కొల్లాపూర్ రోడ్డుపై బైఠాయించారు. వీరి ఆందోళనకు చుట్టుపక్కల గ్రామాల రైతులు సైతం మద్దతు ప్రకటించి ఆందోళనలో పాల్గొన్నారు. పలువురు మాట్లాడుతూ ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించకపోతే ఆత్మహత్యలే శరణ్యమని కొందరు పురుగు మందు డబ్బాలు పట్టుకుని హెచ్చరించారు.

# నకిలీ విత్తనాలతో ఐదుగురు రైతులు మృతి

- రైతుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి
- వేల ఎకరాల్లో పంట నష్టం
- గిరిజన రైతులను ఆదుకోవాలి
- బీజేపీ ఎస్టీ మోర్చా డిమాండ్

హైదరాబాద్, మే 26 (నమస్తే తెలంగాణ): నకిలీ విత్తనాల కారణంగా ఐదుగురు రైతులు చనిపోయారని బీజేపీ ఎస్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కల్యాణ్ నాయక్ తెలిపారు. నకిలీ విత్తనాల వల్ల నష్టపోయిన గిరిజన రైతులకు న్యాయం చేయాలని, వీటిని విక్రయించిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం డీజీపీకి ఫిర్యాదు చేశారు. అనంతరం మాట్లాడుతూ ములుగు జిల్లా వెంకటాపురం ఏజెన్సీ ప్రాంతాల్లో నకిలీ విత్తనాలతో రైతులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. 3,000 ఎకరాల్లో పంట నష్టపోయిందని, ఇందులో 800 మంది గిరిజన రైతులు ఉన్నారని చెప్పారు. వీరందరినీ ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. చనిపోయిన రైతుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని కోరారు. నకిలీ విత్తనాలను సరఫరా చేసిన కంపెనీలపై మనీల్యాండరింగ్ చట్టం, విక్రయించిన దుకాణాల యజమానులపై పీడీ యాక్ట్ కింద క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. డీజీపీని కలిసిన వారిలో ఎస్టీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవి నాయక్ నేనావత్, రాష్ట్ర కార్యదర్శి కుంజా సంతోష్, మహేష్ రూపావత్, బానోత్ అనూష, రమేష్ నాయక్ తదితరులు ఉన్నారు.